క్లుప్తంగా

శ్రీవిశ్వకర్మ చరిత్ర పుస్తకావిష్కరణ

కాకినాడ కల్చరల్: స్థానిక గాంధీనగర్ విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ హాలులో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో రచయిత ర్యాలీ ప్రసాద్ రచించిన శ్రీవిశ్వకర్మ చరిత్ర పుస్తకావిష్కరణ సభ సోమవారం జరిగింది. శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామికి తాను రచించిన పుస్తకం అంకితం చేస్తున్నట్లు ప్రసాద్ తెలిపారు. సంఘ అధ్యక్షులు తామరపల్లి శ్రీనివాస్, వడిశెట్టి భాస్కరరెడ్డి, ఎ.ఉమాశంకర్, పుట్టా భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫస్ట్ ఎయిడ్ కిట్ల అందజేత

కాకినాడ సిటీ: స్థానిక ఏపీఎస్ ఆర్టీసీకి ఎంకే స్కిన్ కేర్ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్‌చే ఫస్ట్ ఎయిడ్ కిట్లు సోమవారం అందజేశారు. ఈ మెడికల్ కిట్‌లో ప్రాథమిక చికిత్సకు అవసరమైన అన్ని మందులు ఉంచారు. ఆసుపత్రి అధినేత లక్ష్మణ్, డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్, అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, అసిస్టెంట్ ఇంజినీర్ ప్రభాకర్ ఉన్నారు.

కేసు కొట్టివేతపై హర్షం

బోట్‌క్లబ్: తునిలో రైలు దహనం కేసు కొట్టివేయడం ద్వారా కాపులు ఏ తప్పూ చేయరని మరోసారి నిరూపితమైందని ఆంధ్రా కాపు సద్భావన సంఘ ప్రధాన కార్యదర్శి చిట్నీడి శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన కాకినాడలో విలేకర్ల సమావేశంతో మాట్లాడారు. 2016 జనవరి 31న తునిలో కాపు ఐక్యగర్జన పేరుతో సభ నిర్వహించగా అందులో పాల్గొన్న వారు రైలును దగ్ధం చేశారని తప్పుడు కేసులు బనాయించారన్నారు. నేడు రైల్వే కోర్టు సరైన ఆధారాలు లేకపోవడంతో ఆ కేసును కొట్టివేసిందన్నారు.

కొత్త కార్యవర్గం ఎన్నిక

కరప: మండలంలోని సప్లయర్లు, డెకరేటర్లు కలిసికట్టుగా సాగాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సిరి శ్రీనివాస్, కార్యదర్శి వాసంశెట్టి చినబాబు అన్నారు. సోమవారం కరపలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా మండల సప్లయర్లు, డెకరేటర్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల శాఖ అధ్యక్షుడిగా పడాల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా కట్టా వెంకటరామారావు, కార్యదర్శిగా కర్రి శ్రీనివాసరావు, కోశాధికారిగా కూనపురెడ్డి వీర్రాజు, జాయింట్ సెక్రటరీగా మద్దూరి శ్రీనివాసరావు, 12 మంది సభ్యులను ఎన్నుకున్నారు.

మహిళలకు చీరల పంపిణీ

కరప: ట్రస్ట్ ఆఫ్ బొండా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం 300 మందికి చీరలు, పంచెలు, తువ్వాళ్లు పంపిణీ చేశారు. ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్, డాక్టర్ బొండా వెంకన్నరావు ఆధ్వర్యంలో వేళంగిలోని శ్రీనివాసా నర్సింగ్ హోమ్ ఆవరణలో ఈ కార్యక్రమం జరిగింది. విశిష్ట సేవలందిస్తున్న గొర్రిపూడి హైస్కూల్ హెచ్ఎం బీవీ శివప్రసాద్, ఎస్‌సీసీ ఉపాధ్యాయుడు వీవీ రమణమూర్తి, డాల్ఫిన్ హోటల్ అధినేత బదిరెడ్డి వెంకన్నలను ట్రస్ట్ తరఫున సత్కరించారు. ట్రస్ట్ డైరెక్టర్లు మూర్తి, డాక్టర్ బొండా సూర్యారావు, బి.రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి శిక్షణ తరగతులు

కాకినాడ కల్చరల్: స్థానిక గాంధీనగర్‌లో చిల్డ్రన్స్ పార్కు ఆవరణలోని బాలభవన్‌లో ఈ నెల 2 నుంచి జూన్ 11వ తేదీ వరకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు బాలభవన్ పర్యవేక్షకురాలు ఎ.శారద తెలిపారు. రోజూ ఉదయం 7.30 నుంచి 10.30 వరకూ, సాయంత్రం 4.30 నుంచి 7.30 గంటల వరకూ గాత్ర, వయోలిన్, మృదంగం, కరాటేలలో శిక్షణ ఉంటుందన్నారు. నగరంతో పాటు గ్రామీణ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 95500 07974 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.

బంగారు ఆభరణాల దోపిడీ

కాకినాడ రూరల్: ఇంద్రపాలెం సంత మార్కెట్ వద్ద ఓ ఇంట్లో ఆదివారం రాత్రి దోపిడీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఎదురుపల్లి సుధారాణి తన ఇంట్లో రాత్రి 8.30 గంటలకు టీవీ చూస్తుండగా గుర్తుతెలియని ఇద్దరు ముఖానికి దుస్తులు కప్పుకొని వచ్చి కత్తితో బెదిరించారు. బీరువాలోని సుమారు రూ.3 లక్షల విలువైన 15 కాసుల బంగారం, వెండి ఆభరణాలను దోచుకుపోయారు. దీనిపై ఇంద్రపాలెం పోలీసులు విచారణ చేపట్టారు. రూరల్ సీఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించింది.

వృద్ధుడి మృతి

కరప: ఓ వృద్ధుడు కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు కరప ఎస్ఐ నౌడు రామకృష్ణ తెలిపారు. నడకుదురు రామలింగేశ్వర కాలనీకి చెందిన వ్యవసాయ కూలీ ప్రత్తి సత్యనారాయణ (70) గత నెల 17న సైకిల్‌పై ఇంటికి వస్తుండగా బైక్ ఢీకొంది. తలకు గాయాలు కావడంతో జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ఆపన్నుల సేవలో తరించండి

కాకినాడ క్రైం: స్థానిక రంగరాయ ఆడిటోరియం సోమవారం నర్సింగ్ విద్యార్థుల 'ల్యాంప్ లైటింగ్'కు వేదికైంది. ఆర్ఎంసీ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నాగశేషమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోగులు, ఆపన్నుల సేవలో తరించాలని నర్సింగ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ దేవీమాధవి మాట్లాడుతూ రోగులకు అందించే వైద్య సేవల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. డాక్టర్ నాగ శేషమ్మ, ఆర్ఎంసీ నర్సింగ్ బోధకులు, సిబ్బంది పాల్గొన్నారు.

చె(చి)త్త శుద్ధికి సలాం

- కార్మికుల ఆరోగ్య భద్రతకు శ్రీకారం
- ప్రత్యేక కార్యాచరణ దిశగా చర్యలు
- నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో తొలి అడుగు


చెత్తను సేకరించే పనుల్లో పారిశుధ్య కార్మికులు

కాకినాడ: ఆరోగ్యమే మహాభాగ్యం అంటుంటారు పెద్దలు.. అలాంటి ఆరోగ్య పరిరక్షణలో పారిశుధ్య కార్మికుల పాత్ర ఎనలేనిది.. రోడ్లు ఊడ్చి.. డ్రైనేజీలు శుభ్రం చేసి.. ఇళ్లకు వెళ్లి చెత్తను సేకరిస్తూ ప్రజారోగ్య పరిరక్షణలో వారే కీలక భూమిక పోషిస్తున్నారు.. 'చెత్త' పనితో ఆరోగ్యాలు ఫణంగా పెట్టి ప్రజారోగ్యానికి బాటలు వేస్తున్నారు. విశేష సేవలు అందిస్తున్న పారిశుధ్య కార్మికుల సంరక్షణకు కాకినాడ నగరపాలక సంస్థ ఓ అడుగు ముందుకు వేసింది. కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల 'మీ ఆరోగ్యం- మా బాధ్యత' అంటూ వీరి కోసం ఓ ప్రత్యేక కార్యాచరణకు సిద్ధమయ్యారు. నగరం సుమారు 32 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉంది. సుమారు 4 లక్షల జనాభా నివసిస్తున్నారు. నగరపాలక సంస్థ పరిధిలో 1,200 మంది రెగ్యులర్, ఔట్ సోర్సింగ్ విధానంలో పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్నారు. వీరంతా నిత్యం వారికి కేటాయించిన విభాగాల్లో పారిశుధ్య సేవలు అందిస్తున్నారు. ఆసుపత్రుల వ్యర్థాలు, డ్రైనేజీలను శుభ్రం చేయడం, రోడ్లను ఊడ్చడం దగ్గర నుంచి మరెన్నో వ్యర్థాలను సేకరించే క్రమంలో కేన్సర్ వంటి ఆరోగ్య సమస్యలు, చర్మ వ్యాధులకు గురవుతున్నారు. అడపా దడపా వారికి వైద్య శిబిరాలు నిర్వహించడం మినహా ఇంతకాలం కార్మికుల ఆరోగ్య పరిరక్షణపై దృష్టి సారించే వారే కరవయ్యారు. ఈ పరిస్థితిలో కమిషనర్‌గా వచ్చిన ఐఏఎస్ అధికారి డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల ఆకస్మిక తనిఖీల్లో వీరి పరిస్థితిని గమనించి ప్రత్యేక దృష్టి పెట్టారు. వీరు అందిస్తోన్న విధులు, ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలు.. ఎన్ని రోజులకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించాలి.. ఎలాంటి చికిత్సలు అవసరం తదితర అంశాలపై అధ్యాయనం చేసేందుకు నలుగురు సభ్యులతో ఓ కమిటీని వేశారు. 15 రోజుల్లో నివేదిక వచ్చాక దీనిపై ఓ నిర్ణయం తీసుకుని కార్మికుల కోసం ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేయాలని యోచిస్తున్నారు. ముఖ్యంగా వీరందరి ఆరోగ్య సమాచారాన్ని ఒకచోటకు చేర్చి ఆన్‌లైన్ పోర్టల్ నమోదు చేసేందుకు సైతం ప్రయత్నిస్తున్నారు. ఇది కార్మిక వర్గాలకు సంతోషాన్ని కలిగిస్తోంది. తమ బాధలు, కష్టాలను స్వయంగా గుర్తించి కమిషనర్ ఓ సముచిత నిర్ణయం తీసుకున్నారంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కార్మికుల భద్రత మాదే..



ప్రజారోగ్యాన్ని పరిరక్షించడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకం. ఈ క్రమంలో వారు ఎన్నో ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. వీరి ఆరోగ్యాన్ని పరిరక్షించే ఉద్దేశంతోనే ఆ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా కార్యాచరణకు సిద్ధమవుతున్నాం. కాకినాడలో పనిచేసే ప్రతి కార్మికుడి ఆరోగ్య భద్రత కూడా మా బాధ్యతగా భావిస్తున్నాం.

–డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల, కమిషనర్ నగరపాలక సంస్థ

కమిటీ సభ్యులు వీరే..

కార్మికుల ఆరోగ్య భద్రతకు సంబంధించి అదనపు కమిషనర్ నాగనరసింహారావు సమక్షంలో సోమవారం సమావేశమైన కమిషనర్ నలుగురు సభ్యులతో కమిటీని వేశారు. ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, డీఈ మాధవి, ప్రొఫెసర్ డాక్టర్ బి.దేవి మాధురి, సాక్ష్యం సంస్థ ప్రతినిధి డాక్టర్ వెంకటరాజు కమిటీ సభ్యులుగా ఉన్నారు.

ఘనంగా భావనారాయణ స్వామి కల్యాణం


భావనారాయణస్వామి అమ్మవార్ల కల్యాణాన్ని తిలకిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు దంపతులు

కాకినాడ రూరల్: సర్పవరంలో రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, సాయంత్రం మాడ వీధుల్లో ఊరేగింపు చేపట్టారు. రాత్రి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు దంపతులు, కురసాల సత్యనారాయణ కల్యాణోత్సవంలో పాల్గొని తిలకించారు.

స్వర్ణాంధ్ర కాలనీలో హోమ పూజలు

కాకినాడ సిటీ: స్థానిక స్వర్ణాంధ్ర కాలనీలో 12వ డివిజన్ వైఎస్సార్ సీపీ కన్వీనర్ జితేందర్ సింగ్ అండ్ బ్రదర్స్, స్థానిక పెద్దల సహకారంతో సిద్ధి వినాయకస్వామి ఆలయం నిర్మించారు. ఈ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవానికి ముందుగా టీటీడీ వేద పండితుడు హోతా శివభాస్కర్ శర్మ ఆధ్వర్యంలో హోమ పూజలు ప్రారంభించారు.

వేణుగోపాలస్వామి కల్యాణం

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయం వీధిలో వేణుగోపాల స్వామి ఆలయం వద్ద స్వామివారి కల్యాణ మహోత్సవం సోమవారం రాత్రి వైభవంగా జరిగింది. స్వామివారికి ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు పట్టువస్త్రాలు సమర్పించారు. పూజల్లో కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ కార్పొరేటర్ రాగిరెడ్డి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

కదిలివచ్చిన కార్మిక లోకం


కాకినాడలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు


కరపలో సీఐటీయూ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు


పోర్టు స్టీవ్‌డోర్స్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మిక జెండా ఆవిష్కరిస్తున్న నూకరాజు

నగరంలో మేడే వేడుకలు

కాకినాడ సిటీ: ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని వివిధ కార్మిక సంఘాలు సోమవారం నిర్వహించాయి. స్థానిక కచేరిపేటలో సీఐటీయూ కార్యాలయం వద్ద ఎర్ర జెండాను రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి ఆవిష్కరించారు. ఐఎఫ్‌టీయూ కార్యాలయం వద్ద జె.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మే డే వేడుకలు జరిగాయి. ఏఐఎఫ్‌టీయూ ఆధ్వర్యాన అచ్యుతాపురం రైల్వే గేటు వద్ద జిల్లా ప్రధాన కార్యదర్శి రంబాల సతీష్ జెండాను ఎగురవేశారు. సుందరయ్య భవన్‌లో సీపీఎం జిల్లా కన్వీనర్ మోర్త రాజశేఖర్ జెండాను ఆవిష్కరించారు. నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

పోర్టు కార్మికులంతా ఐక్యంగా ఉండాలి

కాకినాడ పోర్టు స్టీవ్‌డోర్స్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మే డే వేడుకలు నిర్వహించారు. యూనియన్ కార్యాలయం వద్ద సంఘ ప్రధాన కార్యదర్శి పితాని నూకరాజు కార్మిక జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ వేడుకలకు సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి రావాల్సి ఉన్నా భారీ వర్షం కారణంగా హాజరు కాలేకపోయారన్నారు. పోర్టు కార్మికులంతా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చిన్న భావన్నారాయణ, సుర్ల రాఘవేంద్రరావు, బొందు శివాజీ, గంధ శ్రీను, ఓలేటి చాము, గుబ్బల శివశంకర్, కార్మికులు పాల్గొన్నారు. నగరంలో వివిధ ఎంప్లాయీస్, శానిటేషన్ వర్కర్స్ యూనియన్, జీజీహెచ్ మెస్ వర్కర్స్, క్లాప్ డ్రైవర్స్, మెడికల్ రిప్స్, టాటా మ్యాజిక్ యూనియన్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఆధ్వర్యంలో మే డే ఉత్సవాలు జరిగాయి. కార్యక్రమాల్లో సీఐటీయూ నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు, సీహెచ్ విజయకుమార్, రత్నకుమార్, జేవీ రమణమ్మ, చెక్కల రాజ్‌కుమార్, పాల్గొన్నారు.

కరప: కరప, గురజనాపల్లి, గొర్రిపూడి, వాకాడ తదితర గ్రామాల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో వివిధ సంఘాల మేడే వేడుకలు నిర్వహించాయి. మండల సీఐటీయూ అధ్యక్షుడు కె.సురేష్, ప్రతినిధులు సీహెచ్ రమణి, ఆర్.వెంకటలక్ష్మి, వీరవేణి పాల్గొన్నారు. కరప పంచాయతీలో పారిశుధ్య కార్మికులు, సిబ్బందిని సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, నాయకులు పెంకే సత్తిబాబు, సాదే లోహిదాస్ కుమార్, కార్యదర్శి వి.సునీల్‌కుమార్ సత్కరించారు. వేళంగిలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం, పంచాయతీ వర్కర్స్ యూనియన్‌లు వేడుకలు నిర్వహించాయి. సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గుబ్బల ఆదినారాయణ మూర్తి, భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకుడు గణేశుల శ్రీనివాస్‌లు జెండా ఆవిష్కరించారు.

కాకినాడ రూరల్: రమణయ్యపేట, రాయుడుపాలెం తదితర ప్రాంతాల్లో జరిగిన కార్మిక దినోత్సవంలో నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, లింగం రంగం, వామపక్ష, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ పారిశ్రామిక వాడ జోనల్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో జోనల్ మేనేజర్ బడగల హరిధర్ జెండా ఆవిష్కరించారు.

ఆటో కార్మికులకు అండగా ఉంటాం..


ఆర్థిక సహాయం అందజేస్తున్న రాష్ట్ర రైసుమిల్లర్ల సంఘ అధ్యక్షుడు వీరభద్రారెడ్డి, చంద్రకళాదీప్తి

కాకినాడ: ఆటో కార్మికులకు అన్నివిధాలా అండగా ఉంటానని రాష్ట్ర రైసుమిల్లర్ల సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి అన్నారు. స్థానిక సూర్యకళా మందిరంలో సోమవారం మే డే ఉత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఆటో యజమానులు, కార్మికులు ఐక్యతతో మెలగాలని పిలుపునిచ్చారు. ఇటీవల సుమారు 46 మంది ఆటో కార్మికులు మృతి చెందగా వారి కుటుంబాలకు సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి సూచన మేరకు ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.5 వేల చొప్పున నగదు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర విద్యాసాగర్, ద్వారంపూడి ట్రస్ట్ ఆర్గనైజర్ కర్రి వీర్రెడ్డి (చినబాబు), మాజీ కార్పొరేటర్ రోకళ్ల సత్యనారాయణ, ఆటో యూనియన్ ప్రతినిధులు తాతపూడి మూర్తి, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గా హోమం


దుర్గా హోమంలో పూజా ద్రవ్యాలు వేస్తున్న సత్యనారాయణ, రామకృష్ణ తదితరులు

కాకినాడ రూరల్: రమణయ్యపేట శేషాద్రినగర్‌లో శ్రీబాల కనకదుర్గాదేవి ఆలయం వద్ద దుర్గా హోమాన్ని సోమవారం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు లింగం రవి ఆధ్వర్యంలో హోమం, ప్రత్యేక పూజలలో భారీగా భక్తులు పాల్గొన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, జెడ్పీటీసీ నులుకుర్తి రామకృష్ణ, విజయ్ తదితరులు పాల్గొని హోమ గుండంలో పూజా ద్రవ్యాలు వేశారు.

ఉబ్బసం నివారణకు కంట్రోలర్ థెరపీ


సమావేశంలో మాట్లాడుతున్న రాఘవేంద్రరావు

కాకినాడ క్రైం: ఉబ్బసం నివారణకు కంట్రోలర్ థెరపీ సత్ఫలితాలను ఇస్తుందని ప్రముఖ ఊపిరితిత్తుల వ్యాధి నిపుణుడు, విశ్రాంత డీఎంఈ డాక్టర్ మానుకొండ రాఘవేంద్రరావు అన్నారు. మంగళవారం ప్రపంచ ఆస్తమా దినోత్సవం సందర్భంగా ఊపిరితిత్తుల వ్యాధుల నివారణపై అవగాహన కల్పిస్తూ నగరంలోని ఓ హోటల్‌లో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆల్కెం లేబొరేటరీస్ పల్మోకేర్ డివిజన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ రాఘవేంద్రరావు మాట్లాడారు. ఉబ్బసంతో ప్రపంచంలో చోటు చేసుకుంటున్న మరణాల్లో 42 శాతం భారత్ నుంచేనని రాఘవేంద్రరావు అన్నారు. ఉబ్బసం బారిన పడిన వారు తప్పకుండా మందుల వాడకాన్ని నిర్దిష్ట సమయం వరకూ కొనసాగించాలని అన్నారు. ఆల్కెం పల్మోకేర్ డివిజన్ ఏఎస్ఎం త్రిమూర్తులు పాల్గొన్నారు.

7న ఆర్యవైశ్యుల ఆత్మీయ సభ


సమావేశంలో మాట్లాడుతున్న నగర ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధి పెద్ది రత్నాజీ

కాకినాడ సిటీ: రాజమహేంద్రవరం ఆనం కళా కేంద్రంలో 7న ఏపీఐఐసీ మాజీ అధ్యక్షుడు శ్రీకాకోళపు శివరామ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఉభయగోదావరి జిల్లాల ఆర్యవైశ్యుల ఆత్మీయ సభ జరుగుతుందని నగర ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధి పెద్ది రత్నాజీ తెలిపారు. సోమవారం స్థానిక వైఎంవీ హాలులో ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు లింగమల్లు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రత్నాజీ మాట్లాడుతూ ఆ సమావేశంలో ఆర్యవైశ్యుల అభివృద్ధి, ఐక్యత కోసం చర్చించి నిర్ణయాలు తీసుకుంటామన్నారు. తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య పేరుపై స్మృతి వనం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరతామన్నారు. సీఎం జగన్ ప్రభుత్వంలో ఆర్యవైశ్యుల సత్రాలను తమ కులం వారే నిర్వహించుకోవడానికి జీవో ఇచ్చారన్నారు. స్వర్గీయ పొట్టి శ్రీరాములు జయంతిని ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించడం, చింతామణి నాటక ప్రదర్శనలు జరగకుండా నిలిపివేయడంపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కురసాల కన్నబాబు కాకినాడ సిటీ, రూరల్ ప్రాంతాల్లో దేవాలయాలు, మార్కెటింగ్ కమిటీల్లో తమ కులానికి సముచిత స్థానం కల్పించారన్నారు. ఆర్యవైశ్య ప్రముఖులు కంతేటి కాశీ, వెత్సా ఆనంద్, కూసుమంచి పాపారావు, సామా రమేష్, హరనాథ్ పాల్గొన్నారు.

విపత్తులను సమష్టిగా ఎదుర్కొందాం


అధికారులతో సమీక్షిస్తున్న డాక్టర్ మహేష్‌కుమార్

కాకినాడ: తుపాన్లు, వరదల సమయంలో విపత్తులను అన్ని శాఖల సమన్వయంతో సమష్టిగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందని నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల సూచించారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో విపత్తులను ఎదుర్కొనే అంశంపై అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావుతో కలిసి కార్పొరేషన్, విద్యుత్, పోలీస్, మత్స్య, అటవీ, ఉద్యాన, రెవెన్యూ, అగ్నిమాపక తదితర శాఖల అధికారులతో ఆయన సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా ఎదుర్కోవాలన్నారు. విపత్తుల సమయంలో ఆయా శాఖల పరంగా ఎదురయ్యే సమస్యలపై వారం రోజుల్లో నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. విపత్తుల సమయంలో చెట్లు పడిపోవడం, విద్యుత్‌కు అంతరాయం కలగడం, కాలనీలు నీట మునిగితే మత్స్యశాఖ ద్వారా బోట్లు, ఇతర ఏర్పాట్లు, ముంపునకు గురికాకుండా ఆయా ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, పునరావాస కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపై ఆయా శాఖల అధికారులు తమ అభిప్రాయాలను కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. వీటన్నింటిని క్రోడీకరించి నివేదికను తయారు చేస్తే అప్పటికప్పుడు ఉత్పన్నమయ్యే సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని కమిషనర్ తెలిపారు.

విజ్ఞానదాయకంగా బర్న్స్ అవేర్‌నెస్ సీఎంఈ

కాకినాడ క్రైం: స్థానిక రంగరాయ వైద్య కళాశాలలో బర్న్స్ అవేర్‌నెస్, ప్రివెన్షన్ అండ్ ట్రీట్మెంట్ సీఎంఈ (కంట్యునస్ మెడికల్ ఎడ్యుకేషన్) కార్యక్రమాన్ని విజ్ఞానదాయకంగా నిర్వహించారు. సోమవారం ఆర్ఎంసీకి చెందిన డిపార్టుమెంట్ ఆఫ్ ప్లాస్టిక్ సర్జరీ, నేషనల్ అకాడమీ ఆఫ్ బర్న్స్ ఇండియా (ఎన్ఏబీఐ) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎన్ఏబీఐ ప్రెసిడెంట్ డాక్టర్ అనంత సిన్హా, హెచ్ఓడీ డాక్టర్ పి.లక్ష్మి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రత్నభూషణ్, సీనియర్ కన్సల్టెంట్, ప్లాస్టిక్ సర్జరీ వైద్య నిపుణుడు డాక్టర్ కె.విష్ణుమూర్తి పాల్గొన్న ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి హాజరైన వైద్యులకు ప్లాస్టిక్ సర్జరీలోని కీలక విషయాలపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ సర్జరీ వైద్య విభాగంలో మార్పులను అందిపుచ్చుకోవాలన్నారు. డాక్టర్ విష్ణుమూర్తి సహా జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవిలను ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కాకినాడ శాఖ తరఫున సత్కరించారు. ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్, సర్జరీ విభాగ వైద్యులు పాల్గొన్నారు.

వర్షం తెచ్చిన కన్నీళ్లు

- తడిసిన ధాన్యపు రాశులు
- ఆందోళన చెందుతున్న రైతులు


వలసపాకలలో ధాన్యం రాశులపై బరకాలు కప్పి..


వేములవాడలో వర్షానికి నేలనంటిన చేను


నీటమునిగిన జేఎన్‌టీయూకే నుంచి ఎల్‌బీనగర్ వెళ్లే రహదారి

కరప: రైతన్నల ఆశలపై వర్షం నీళ్లు చల్లింది.. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను నిండా ముంచింది.. కరప మండలంలో సోమవారం కురిసిన అకాల వర్షానికి చేతికందివచ్చిన పంట నీట పాలైంది. ధాన్యం రాశులు తడిసిపోయి, కోసిన చేలు పనల మీద ఉండటంతో నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలో 14,443 ఎకరాల్లో రబీ సాగు చేశారు. ఈ ఏడాది దాళ్వా ముందుగా నాటిన పొలాల్లో కోతలు పూర్తవ్వగా, ఆలస్యమైన ప్రాంతాల్లో మాసూళ్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. గత నెలలో తుపాన్ గండం నుంచి గట్టెక్కామనుకుని, ఎండలు బాగా కాస్తుండటంతో కూలీలు, కోత మెషీన్లతో వ్యవసాయ పనులను రైతులు ముమ్మరం చేశారు. కోత యంత్రాలతో కోసిన ధాన్యాన్ని మడులు, రోడ్ల పక్కన, లేఅవుట్లలో రాశులుగా పోసి ఉంచారు. ఎండలు కాస్తుండటంతో ధాన్యం రాశులపై బరకాలు సరిగ్గా కప్పలేదు. సోమవారం ఉదయం 6 గంటల నుంచి 9.30 గంటల వరకు కుండపోతగా కురిసిన వర్షానికి ధాన్యం రాశులు తడిసిపోయాయి. కోసిన గడ్డి మళ్లలో ఉండిపోయింది. కూలీలతో కోసిన వరి పంట పన మీద ఉండడంతో తడిసిపోయిందని రైతులు అంటున్నారు. వర్షం తెరిపివ్వగానే కొన్ని గ్రామాల్లో మళ్లలో ఉన్న ధాన్యాన్ని కూలీలతో గట్టుకు చేర్చుకున్నారు. ధాన్యం రాశులు తడిసిపోవడంతో తేమ శాతం పోయేందుకు ఎండబెట్టేందుకు అదనపు పెట్టుబడులు అవుతాయని రైతులు వాపోతున్నారు. మళ్లల్లో తడిసిన గడ్డి ముక్కువాసన వచ్చి, పశువులు తినవని అంటున్నారు. కోయని వరి చేను నేలనంటి, ధాన్యం దెబ్బతింటుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది బొండాలు(ఎంటీయూ–3626) రకం సాగు చేశామని, మద్దతు ధరకు కొనుగోలు చేయడం లేదని, 75 కిలోల బస్తా రూ.1,350కు కొనేవారని, నాలుగు రోజుల నుంచి రూ.50 తగ్గించడంతో విక్రయించకుండా కళ్లంలో ఉంచేశామని, వర్షానికి తడిసిపోయిందని పలువురు రైతులు తెలిపారు. వర్షానికి ధాన్యం తడిసిపోవడంతో వ్యాపారులు సవాలక్ష సాకులు చెప్పి ధర బాగా తగ్గించి కొంటారని అంటున్నారు.

బోట్‌క్లబ్: నెల రోజులుగా ఎండలతో సతమతమవుతున్న నగర ప్రజలకు సోమవారం ఉదయం కురిసిన వర్షంతో ఉపశమనం లభించింది. ఉదయం 6 గంటలకు ఒక్కసారిగా కారు మబ్బులు కమ్ముకున్నాయి. మధ్యాహ్నం వరకూ జల్లులు పడడంతో పలు ప్రాంతాలు నీట మునిగాయి. ఏప్రిల్ నెల నుంచి కాకినాడలో 36 డిగ్రీల నుంచి 40 డిగ్రీలకు తక్కువ కాకుండా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ప్రస్తుతం వర్షాలు పడడంతో వేడి గాలులు నుంచి ఊరట లభించింది. హోరున వర్షానికి నగరంలో పలు ప్రాంతాలు పూర్తిగా నీటమునిగాయి. సాంబమూర్తినగర్, విద్యుత్‌నగర్, ఎల్‌బీ నగర్, జగన్నాథపురం, శశికాంత్‌నగర్, సిద్ధార్థనగర్, గాంధీనగర్‌తో పాటు పలు ప్రాంతాల్లో వర్షపు నీటికి ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని మృతి


పరిమళ కుమారి మృతదేహం

కాకినాడ క్రైం: కాకినాడలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పాలిటెక్నిక్ చదువుతున్న ఓ డిప్లమో విద్యార్థిని ప్రాణాలు కోల్పోయింది. జగన్నాథపురం వలందపేటకు చెందిన ముర్దన్న పరిమళ కుమారి (19) స్థానిక ఏపీటీలో పాలిటెక్నిక్‌ల తృతీయ సంవత్సరం చదువుతోంది. సోమవారం రాత్రి తన ద్విచక్ర వాహనంపై ఆసుపత్రికి వెళ్లి ఇంటి వెళ్తున్న సమయంలో ఆమెను జగన్నాథపురం చినమార్కెట్ సమీపంలో ఓ బొలెరో వాహనం ఢీకొంది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇంటికెళ్లి.. పింఛను ఇచ్చి..


పెదకొత్తూరులో బళ్ల రామతాతకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ బళ్ల వరలక్ష్మి

కరప: హోరున వర్షంలోనూ పింఛన్ల పంపిణీ ఆగలేదు.. ఇంటికెళ్లి మరీ పింఛనుదారులకు వలంటీర్లు సొమ్ము అందించారు. మండలంలో 11,317 మంది పింఛనుదారులు ఉండగా సోమవారం 8,480 మందికి (74.93 శాతం) పంపిణీ చేశామని ఎంపీడీఓ కర్రె స్వప్న తెలిపారు. పింఛన్ల సొమ్ము రూ.3,08,69,500 బట్వాడా చేయాల్సి ఉండగా రూ.2,31,12,750 ఇచ్చామన్నారు. గ్రామాల్లో కొంతమంది లబ్ధిదారులు లేక, సర్వర్ స్లోగా పనిచేయడం తదితర కారణాలతో నూరు శాతం పంపిణీ జరగలేదన్నారు. మంగళ, బుధవారాల్లో నూరు శాతం పూర్తి చేయిస్తామని చెప్పారు. ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శులు పింఛన్ల పంపిణీని పర్యవేక్షించారు. పెనుగుదురు–2 గ్రామ సచివాలయంలో 86.67 శాతం, యండమూరు గ్రామ సచివాలయం 84.42 శాతం, వేళంగి–1 గ్రామ సచివాలయం 83.43 శాతంతో పింఛన్ల పంపిణీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి.